సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం । 14 । ఆగస్టు । 2023



మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌కు అభినందనలు

సిరిసిల్ల: రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమితులైన బండ నర్సయ్యయాదవ్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ ఆదివారం అభినందించారు.



కేజీబీవీల్లో టీచర్ల పోస్టులు భర్తీ

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేశారు. ఆదివారం జాయినింగ్ లెటర్స్ అందించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లేశ్‌యాదవ్



వీరవేణి మల్లేశ్ యాదవ్

సిరిసిల్ల: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వీరవేణి మల్లేశ్‌యాదవ్‌ను ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో బీసీ సంక్షేమ సంఘం సిరిసిల్ల డివిజన్ అధ్యక్షుడిగా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన మల్లేశ్‌యాదవ్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు ప్రకటించారు.

కేసీఆర్‌ని గద్దెదించితేనే అమరులకు నివాళి



జెండా ఎగురవేస్తున్న మహేందర్‌రెడ్డి

గంభీరావుపేట(సిరిసిల్ల): కేసీఆర్‌ను గద్దె దించితేనే తెలంగాణ అమరులకు నిజమైన నివాళి అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గోరింటాల రాజేశ్వర్‌రావునగర్, గజసింగవరం, మక్తనాయక్ తండాలలో ఆదివారం జెండా పండుగ నిర్వహించారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తామని ఆశపడ్డారని, కానీ దొరల పాలన సాగుతోందని విమర్శించారు. పార్టీ మండలాధ్యక్షుడు హమీద్, నాయకులు రామచంద్రారెడ్డి, అంజాగౌడ్, దేవయ్య, పిట్ల వెంకటి, సత్యం, పంతం సురేష్, అంజయ్య, నవీన్ పాల్గొన్నారు.

శిథిల భవనాల పరిశీలన



శిథిలమైన భవనాలు పరిశీలిస్తున్న తోట ఆగయ్య

గంభీరావుపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని సత్సంగ సదనంలో శిథిల భవనాలను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆదివారం పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న వంట గదిని తాత్కాలికంగా సొంత ఖర్చులతో మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు సమకూర్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, సభ్యులు ఆనందరెడ్డి, సంజీవరెడ్డి, రాజిరెడ్డి, రాజయ్యయాదవ్, రవీందర్‌రావు, బండారి బాల్‌రెడ్డి ఉన్నారు.

అపూర్వ సమ్మేళనం



వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ఎస్సారార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని టెక్స్‌టైల్ టెక్నాలజీ 1999 - 2003 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. కళాశాలలో ఉత్తీర్ణత పొంది దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రవేటు సంస్థల్లో ఉన్నతస్థానాల్లో ఉన్నారు. వారంత ఒక్కచోట కలుసుకొని ఆనందంగా గడిపారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్, కాశీవిశ్వనాథ్, ప్రభాకరాచారి, లోకేశ్, కృష్ణారెడ్డి, జ్ఞానసాగర్, పూర్వ విద్యార్థులు బ్రహ్మానందరెడ్డి, నరసింహమూర్తి, సుమన్, భరత్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనందాల వేదిక



వేములవాడ: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులంలోని విద్యార్థులను చూసేందుకు వారి తల్లిదండ్రులకు ఆదివారం అవకాశం ఇవ్వడంతో అక్కడ సందడిగా మారింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పాఠశాల ఆవరణలోని కుటుంబ సభ్యుల మధ్య గడుపుకునేందుకు అవకాశం కల్పించారు. ఆదివారం ఇలా చెట్ల కింద చిన్నారులతో కుటుంబ సభ్యులు ఆత్మీయత పంచుకుని సంబరపడిపోయారు. వేములవాడలోని బాలానగర్ బైపాస్‌రోడ్డు సందడిగా మారింది.

నలుదిశలా ప్రగతి

- సిరిసిల్ల చుట్టూరా అభివృద్ధి చిహ్నాలు
- బైపాస్‌రోడ్లు.. విద్యాసంస్థలు
- ఒక్కో దిక్కుకు ఒక్కో సంస్థ
- మారుతున్న పట్టణ రూపురేఖలు

"సిరిసిల్ల: ఒకప్పుడు కల్లోల ఖిల్లా.. ఆకలి చావులు.. ఆత్మహత్యలకు నెలవు. పాత తాలూకా కేంద్రంగా వస్త్రోత్పత్తికి నిలయంగా ఉండేది. ఇప్పుడు జిల్లా కేంద్రంగా పట్టణ రూపురేఖలు మారుతున్నాయి. నలుదిశలా అభివృద్ధి కాంతులతో విస్తరిస్తోంది. లక్షకుపైగా జనాభా ఉన్న పట్టణంలో ప్రగతి పల్లవిస్తోంది. సమీప భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులతో రూపురేఖలు మారిపోనున్న సిరిసిల్లపై ప్రత్యేక కథనం."



రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్ ప్రాంగణం

ఉత్తరాన కలెక్టరేట్

సిరిసిల్ల పట్టణానికి ఉత్తర దిశలో కలెక్టరేట్ ఏర్పాటైంది. 36 ఎకరాల్లో కలెక్టరేట్ ఆఫీస్, కలెక్టర్, అదనపు కలెక్టర్ల నివాసాలను సైతం ఏర్పాటు చేశారు. 25 ఎకరాల్లో జిల్లా పోలీస్ అధికారి(ఎస్పీ) ఆఫీస్ భవనం సిద్ధమైంది. రగుడు శివారులో 93 ఎకరాల భూమి అందుబాటులో ఉండడంతో జిల్లా అధికారుల నివాసాలు, ఇతర ప్రభుత్వ అవసరాలు తీర్చుకోవచ్చు. ఉత్తర దిశగా వేములవాడ వరకు పట్టణం విస్తరిస్తోంది.

దక్షిణ దిశగా జేఎన్‌టీయూ

జిల్లా కేంద్రానికి దక్షిణ దిశగా మానేరువాగు అవతల.. మండెపల్లి వద్ద జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం మండెపల్లి వద్ద 20 ఎకరాల స్థలాన్ని ఇటీవల కేటాయించారు. ఇప్పటికే ఇక్కడ ఐటీఐ, అంతర్జాతీయ ప్రమాణాలతో డ్రైవింగ్ శిక్షణ-పరిశోధన కేంద్రం, మోడల్‌స్కూల్, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీ, ఇందిరమ్మకాలనీ, టెక్స్‌టైల్ పార్క్‌లు ఏర్పాటయ్యాయి.

తూర్పున రైల్వేస్టేషన్

పట్టణానికి తూర్పున తాడూరు వద్ద రైల్వేస్టేషన్‌ను ప్రతిపాదించారు. రైల్వేస్టేషన్ నిర్మాణానికి 300 మీటర్ల వెడల్పుతో, 2వేల మీటర్ల పొడవుతో 200 ఎకరాల భూసేకరణ పూర్తయింది. మరోవైపు రగుడు కలెక్టరేట్ సర్కిల్ నుంచి మధ్యమానేరు బ్యాక్‌వాటర్ మీదుగా.. గోపాల్‌రావుపల్లి, తాడూరు, లక్ష్మీపూర్, పాపయ్యపల్లి మీదుగా మండెపల్లి రోడ్డు వరకు కొత్త రోడ్డును ప్రతిపాదించారు. మధ్యమానేరు బ్యాక్‌వాటర్‌పై రైల్వే ట్రాక్‌తోపాటు మరో వంతెన, రోడ్డును వేయాలని ప్రతిపాదించారు.

అదనపు హంగులు

మధ్యమానేరు బ్యాక్‌వాటర్‌లో తెలంగాణ టూరిజం బోటింగ్, వేములవాడ ఆలయ, నాంపల్లి గుట్టలు పర్యాటకులను ఆకట్టుకోనున్నాయి. మరోవైపు ఇప్పటికే సిరిసిల్లలో నర్సింగ్ కాలేజీ, సర్దాపూర్‌లో వ్యవసాయ పాలిటెక్నిక్, జిల్లెల్లలో వ్యవసాయ కాలేజీ, వ్యవసాయ మార్కెట్ యార్డు ఇలా సిరిసిల్ల పట్టణం నలుదిశలా ప్రగతి పల్లవించనుంది.



మెడికల్ కాలేజీ భవనం



పట్టణ వ్యూ

పశ్చిమాన మెడికల్ కాలేజీ

పట్టణానికి పశ్చిమాన రగుడు-వెంకటాపూర్ బైపాస్‌రోడ్డులో పెద్దూరు వద్ద 36 ఎకరాల్లో మెడికల్ కాలేజీ నిర్మాణమైంది. వచ్చే నెలలో మెడికల్ కాలేజీని ప్రారంభిస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. ఇప్పటికే కాలేజీ భవనం పూర్తికాగా.. ఎంబీబీఎస్ అడ్మిషన్లు జరుగుతున్నాయి. అక్కడే హరితహోటల్, మెడికల్ కాలేజీ హాస్టల్ నిర్మాణమవుతున్నాయి. ఇక్కడే ఇప్పటికే అపెరల్ పార్క్ నిర్మాణమైంది. ఇక్కడ వర్కర్ టు ఓనర్ పథకానికి వర్క్‌షెడ్లు నిర్మించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కస్తూర్బా స్కూల్ ఏర్పాటైంది. మెడికల్ కాలేజీ పూర్తయితే జిల్లా జనరల్ ఆస్పత్రి కూడా ఇక్కడికి రానుంది. సిరిసిల్లకు పశ్చిమ దిశగా పట్టణం విస్తరించేందుకు పుష్కలమైన అవకాశం ఉంది.

ఒక్కటవుతున్నారు!



కలెక్టరేట్‌లో టెండర్స్ స్వీకరిస్తున్న ఆబ్కారీ అధికారులు (ఫైల్)

- వైన్స్‌షాపుల టెండర్ దాఖలకు గ్రూపులు
- రిజర్వేషన్ అభ్యర్థులతో డీల్
- గుడ్‌విల్ ఇచ్చేందుకు ఒప్పందాలు
- సిరిసిల్ల షాపులకు మస్త్ గిరాకీ

సిరిసిల్లక్రైం: మద్యం దుకాణాలను ఎలాగైనా దక్కించుకోవాలన్న ఉద్దేశంతో ఇప్పటికే ఆ వ్యాపారంలో ఉన్న బడాబాబులు అందరూ ఒక్కటవుతున్నారు. గ్రూపులుగా చేరి మూకుమ్మడిగా వైన్స్‌లకు టెండర్లు వేస్తున్నారు. ఎవరికి టెండర్ దక్కినా అందరూ కలిసి వ్యాపారం చేసుకునేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. జనరల్ వైన్స్‌లకు పోటీ ఎక్కువగా ఉంటుందని భావించిన పలువురు రిజర్వేషన్లు ఉన్న వైన్స్‌లపై దృష్టి సారించారు. రిజర్వేషన్ల వైన్స్‌లకు ఆయా వర్గాలవారితో టెండర్లు వేయిస్తూ.. వారితో ముందుగానే ఒప్పందాలు చేసుకుంటున్నారు. అవసరమైతే వారికి గుడ్‌విల్ ఇచ్చి ఆ షాపును దక్కించుకునేలా ఎత్తులు వేస్తున్నారు. ఈ ఏడాది ఎన్నికలు రానుండడంతో వ్యాపారం ఎక్కువగా ఉంటుందని భావించి ఎలాగైనా షాపులను దక్కించుకోవాలనే ఉద్దేశంతో కొందరైతే ఇరువై వరకు టెండర్లు వేసినట్లు తెలిసింది. ఏది ఏమైనా ఈసారి మద్యం దుకాణాలకు పోటీ ఎక్కువగా ఉంది.

ఐదు.. పది శాతం వాటా

మద్యం దుకాణంలో లెక్కల విధానాన్ని చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఒక వ్యక్తి వైన్స్ తనకు రావాలన్న విధానంలో టెండర్ దాఖలు చేయరు. రూ.2 లక్షల దరఖాస్తులో తన వాటా ఐదు నుంచి పది శాతం ఉండేలా ఒప్పందం చేసుకుని అలా పది నుంచి 50 మంది వరకు గ్రూపులుగా మారి పదుల సంఖ్యలో టెండర్స్ దాఖలు చేస్తున్నట్లు తెలిసింది. ఎక్కడ మద్యం దుకాణం లాటరీలో దక్కిన దానిలో అందరికీ భాగస్వామ్యం ఉండేలా ముందుగానే ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇంకొందరు పొత్తు అంటే తగాదా అనే అభిప్రాయంలో కుటుంబీకులు, వారి బంధువులు మాత్రమే ఉండేలా గ్రూపులుగా ఏర్పడి మద్యం దుకాణం దక్కించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. లక్కుతో కిక్కు సాధించిన వాళ్లు... కిక్కు వ్యాపారం సంక్షోభంలో చిక్కుకున్న వాళ్లు జిల్లాలో అనేక మంది ఉన్నారు.

పది దుకాణాల్లో రూ.20 కోట్ల పైన వ్యాపారం

జిల్లాలోని 48 దుకాణాల్లో పది వైన్‌షాపుల్లో ఒక్కో దుకాణం రూ.20 కోట్ల వ్యాపారం చేసినట్లు ఆబ్కారీ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. సిరిసిల్లలో 1వ షాపు సెవెన్ హిల్స్ రూ.24.82 కోట్లు, ఇల్లంతకుంట మండలంలోని 14వ షాపు ఓం శ్రీసాయి రూ.23.77 కోట్లు, సిరిసిల్లలోని 7వ షాపు వినాయక రూ.23.73 కోట్లు, ముస్తాబాద్ 40వ షాపు తాజులాల్ రూ.23.35 కోట్లు, జిల్లెల్ల 11వ షాపు తెలంగాణ రూ.22.43 కోట్లు, వేములవాడ 25వ షాపు లక్ష్మీసాయి రూ.22.42 కోట్లు, వేములవాడ 26వ షాపు శ్రీలక్ష్మీనర్సింహ రూ.22.37 కోట్లు, ఎల్లారెడ్డిపేట 38వ షాపు ఓంసాయిరాం రూ.22.18 కోట్లు, ముస్తాబాద్ 41వ షాపు ఎస్ఎల్ఎన్ రూ.20.43 కోట్లు, లింగంపేట 35వ షాపు శ్రీరేణుకమాత రూ.19.28 కోట్ల వ్యాపారం జరిగినట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి.

అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు..

వైన్స్ వ్యాపారం చేయడం సాధ్యం కాదని తెలిసినా లాటరీ లక్కు తగిలితే దుకాణాన్ని గుడ్‌విల్ కింద అమ్మవచ్చని పూర్తిగా లక్కు మీదనే ఆధారపడి దరఖాస్తు చేసే వాళ్లు జిల్లాలో ఉన్నారు. ఇలా సింగిల్ దరఖాస్తు చేసి లక్షలాది రూపాయలను దక్కించుకున్న పరిస్థితి ఉంది. ఇలాంటి విధానంలో దుకాణం దక్కిన వారిలో ఒకరిద్దరు షాపు రెండేళ్లుగా విజయవంతంగా నడిపించిన సందర్భాలు ఉన్నాయి. సింగిల్‌ఫాంతో వైన్స్ దక్కితే రూ.25 లక్షలు ఇచ్చి మరీ దుకాణాన్ని గ్రూపు సభ్యులు తీసుకునే అవకాశం ఉంటుందని మద్యం వ్యాపారంలో ఏళ్లుగా ఉంటున్న సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

సిరిసిల్ల: కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించే స్వాతంత్య్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆదివారం జిల్లా అధికారులతో సమీక్షించారు. సత్యప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్య్ర వేడుకల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు పాల్గొంటారని, ఉదయం 11 గంటలకు జెండా ఆవిష్కరిస్తారని తెలిపారు. స్టేజీ, బారికేడ్లు, సీటింగ్, శానిటేషన్, తాగునీటి వసతి ఏర్పాట్లు చేయాలని సూచించారు. సిరిసిల్ల ఆర్డీవో ఎస్.ఆనంద్‌కుమార్, భూసేకరణ విభాగం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ బి.గంగయ్య, కలెక్టరేట్ ఏ వో రాంరెడ్డి, పర్యవేక్షకులు వేణు, సిరిసిల్ల డిప్యూటీ తహసీల్దార్ మురళి తదితరులు పాల్గొన్నారు.

తిరగబడదాం.. తరిమికొడదాం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: కేంద్రం, రాష్ట్రంలోని ప్రభుత్వాలను తరిమికొట్టడమే ధ్యేయంగా ముందుకుసాగాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని 7, 8 వార్డులలో ఆదివారం సందర్శించిన ఆయన స్థానికులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినప్పుడే రైతు రుణమాఫీ చేస్తామని చెబుతూ ప్రభుత్వం కాలం వెల్లదీస్తుందన్నారు. పంటను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని చెప్పి 40 కిలోలకు నాలుగు కిలోలు దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీబంధు బీఆర్‌ఎస్‌బంధుగా మారిందని విమర్శించారు. దళిత, గిరిజనులకు మూడెకరాల భూమి ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ విషయాలను ప్రజలు గమనించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, కొమురయ్య, చిలుక రమేశ్, నాగుల రవీందర్, తూమ్ మధు, కదిరె రాజుకుమార్, నరేశ్, నాగుల మహేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

మాజీ సర్పంచుల డిమాండ్లు నెరవేర్చాలి

- మాజీ సర్పంచుల సంక్షేమ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య
- సిరిసిల్లలో ఆరు రోజులుగా రిలే దీక్షలు



నినాదాలు చేస్తున్న మాజీ సర్పంచులు

సిరిసిల్ల: గ్రామాల్లో ప్రజలకు గతంలో ఐదేళ్లు సేవలందించిన మాజీ సర్పంచుల డిమాండ్లు నెరవేర్చాలని మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య కోరారు. సిరిసిల్లలో ఆరు రోజులుగా నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ సర్పంచులుగా పనిచేసిన కాలంలో చేసిన అభివృద్ధి పనులకు సరిగ్గా బిల్లులు రాక అప్పులపాలయ్యామన్నారు. మాజీ సర్పంచులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. మాజీ సర్పంచులు సంపునూరి మల్లేశం గౌడ్, గుమ్మడి కాంతయ్య, దేవుని సుజాత, నర్సయ్య, రాజమల్లయ్య, బొల్లు ఎల్లయ్య, బామ్మగారి పర్శరాములు, మారెపల్లి లచ్చిరెడ్డి, గాజే భూలక్ష్మి, కనగండ్ల శంకరయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఉమ్మడి' షూటింగ్ బాల్ పోటీలకు స్పందన



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్: షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని సప్తగిరికాలనీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన 42వ అండర్-19 ఉమ్మడి జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు స్పందన లభించింది. 250 మందికి పైగా క్రీడాకారులు హాజరైనట్లు సంఘం కార్యదర్శి ఎండీ.ముఫాజిల్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 20న జనగాం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పీడీ, పీఈటీలు ఇనాక్, శ్రీధర్, మహేశ్,రమేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మంచిని రక్షించాలి



ప్రభోదిస్తున్న తిగుళ్ల నరసింహమూర్తి శర్మ

గంభీరావుపేట(సిరిసిల్ల): చెడును నిర్మూలించి.. మంచిని రక్షించాలని భగవానుడు తన సుదర్శనచక్రం ద్వారా ప్రపంచానికి తెలిపారని త్రిగుళ్ల నరసింహమూర్తిశర్మ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని సత్సంగ సదనంలో అధిక శ్రావణ పురుషోత్తమ మాసం సందర్భంగా ఆదివారం సుదర్శన చక్రానికి సంబంధించిన ప్రవచనాలు వినిపించారు. భగవంతున్ని పూజిస్తే భక్తులను ఎల్లవేళలా కాపాడుకుంటారన్నారు.

బీడీ కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం

సిరిసిల్లటౌన్: బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తామని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బీఎల్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు ముద్రకోల ఆంజనేయులు తెలిపారు. ఆదివారం సిరిసిల్లలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీడీ కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవనభృతి ఇవ్వాలని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2016 పింఛన్ అందించాలని, ప్యాకర్లు, టేకేదార్లు, బట్టీవాలా, చాటావాలల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సోమవారం ఉదయం సిరిసిల్ల కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు.

ఆలయాలకు నిధులు మంజూరు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల నియోజకవర్గంలోని వివిధ ఆలయాలకు టీటీడీ ట్రస్ట్ ద్వారా నిధులు మంజూరయ్యాయి. ఈమేరకు ప్రొసీడింగ్ లెటర్‌ను ఎల్లారెడ్డిపేటలోని వేణుగోపాలస్వామి ఆలయానికి ఆదివారం అందింది. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయానికి మొదటి విడతలో రూ.1.80 కోట్లు మంజూరు కాగా, రెండో విడతగా రూ.1.20కోట్లు మంజూరైనట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నంది కిషన్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.4.42 కోట్లు, తంగళ్లపల్లిలోని రామాలయానికి రూ.70లక్షలు, ముస్తాబాద్‌లోని వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి రూ.1.10కోట్లు మంజూరయ్యాయి.

తప్పిన ఎత్తిపోతల వ్యయం

- వరద నీటితోనే నిండిన మిడ్‌మానేరు
- రెండు మోటార్లు ఎత్తిపోసింది 2 టీఎంసీలు
- వరుస వానలతో చేరిన 13 టీఎంసీలు
- తప్పిన విద్యుత్ ఖర్చులు



వరద కాలువ ద్వారా వస్తున్న నీరు



మిడ్‌మానేరు ప్రాజెక్టు

బోయినపల్లి(చొప్పదండి): ఈసారి ఎత్తిపోతల ఖర్చు తప్పింది. నాలుగు రోజులు బాహుబలి మోటార్లు కాళేశ్వరం నీటిని ఎత్తిపోయగానే వరుసగా వర్షాలు కురిసి మిడ్‌మానేరులోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. ఫలితంగా ప్రస్తుతం ప్రాజెక్టులో 20 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాళేశ్వరం జలాలను కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ పంప్‌హౌస్ నుంచి బాహుబలి మోటార్ల ద్వారా నాలుగు రోజుల్లో దాదాపు 2 టీఎంసీల నీరు ఎత్తిపోశారు. వరుస వర్షాలతో దాదాపు 13 టీఎంసీ వరద నీరు వచ్చి చేరింది.

జూన్ 1 నుంచి ఈనెల 10 వరకు మిడ్‌మానేరకు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలు

నీటి సామర్థ్యం	: 27.50 టీఎంసీలు	ఎల్ఎండీకి విడుదల చేసిన నీరు	: 11.693 టీఎంసీలు
మిడ్‌మానేరుకవచ్చిన ఇన్‌ఫ్లో	: 15.313 టీఎంసీలు	ప్యాకేజీ-10కు విడుదల చేసిన నీరు	: 2.661 టీఎంసీలు
వరద ఇన్‌ఫ్లో	: 13.353 టీఎంసీలు	మిషన్ భగీరథకు విడుదల చేసిన నీరు	: 0.481.211 టీఎంసీలు
కాళేశ్వరం నుంచి ఇన్‌ఫ్లో	: 1.960 టీఎంసీలు	నిల్వ ఉన్న నీరు	: 20.30 టీఎంసీలు
ఔట్ ఫ్లో	: 16.077 టీఎంసీలు		

ఒక్క నెలలో 15 టీఎంసీల ఇన్‌ఫ్లో

జూన్ ఒకటో తేదీ నుంచి ఈనెల 10వ తేదీ వరకు మిడ్‌మానేరులోకి 15.313 టీఎంసీల రికార్డు స్థాయి ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. ఇందులో కాళేశ్వర జలాలు 1.960 టీఎంసీలు కాగా, మెజార్టీగా 13.353 టీఎంసీల మేర వరదనీటి ఇన్‌ఫ్లో ఉంది. జూలై 27న ఒక్క రోజే ఆరు టీఎంసీల మేర వరద మిడ్‌మానేరుకు చేరగా, ఎల్ఎండీకి వదిలారు. కేవలం ఒక్క రోజే ఇంత పెద్ద మొత్తంలో ఇన్‌ఫ్లో రావడం రికార్డుగా అధికారులు చెబుతున్నారు. జూన్ 1 నుంచి ఈనెల 10 వరకు మధ్యమానేరు ప్రాజెక్టు గేట్ల ద్వారా 11.693 టీఎంసీల నీటిని ఎల్ఎండీకి విడుదల చేశారు.

ఎల్ఎండీకి11 టీఎంసీల నీటి విడుదల

మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి వరదనీరు భారీగా రావడంతో ఇంజినీరింగ్ అధికారులు ఎల్ఎండీలోకి గత నెల 21న నీటిని విడుదల చేశారు. గత జూన్ నుంచి ఈనెల 7 వరకు మిడ్‌మానేరు నుంచి ఎల్ఎండీలోకి 11.693 టీఎంసీల మేర నీరు తరలించారు. కాళేశ్వరం-10వ ప్యాకేజీ అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 2.661 టీఎంసీలు తరలించారు. 0.0481.211 టీఎంసీ నీరు మిషన్ భగీరథ పథకాలకు తరలించారు.

రూ.కోట్లలో తప్పిన ఎత్తిపోతల ఖర్చు

గత రెండేళ్లుగా మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి మోటార్ల ద్వారా ఎత్తిపోతలతో కాళేశ్వరం జలాలు తరలించేవారు. రామడుగు మండలం లక్ష్మీపూర్ పంప్‌హౌస్ నుంచి బాహుబలి మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసి వరదకాలువ మీదుగా మిడ్‌మానేరుకు వచ్చేవి. ఇలా చేయడంతో విద్యుత్ బిల్లులు, మోటార్ల భారంతో రూ.కోట్లలో ఖర్చు వచ్చేది. ఒక్క బాహుబలి మోటార్ 139 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం ఉంటుంది. ఒక్క మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీరు ఎత్తి పోస్తుంది. ఇలా రెండు బాహుబలి మోటార్ల ద్వారా జూలై 17 నుంచి 21వ తేదీ వరకు సుమారు 2 టీఎంసీల మేర నీరు ఎత్తిపోశారు. బాహుబలి మోటార్లతో నాలుగు రోజుల ఎత్తిపోయడంతో రూ.లక్షల్లో మాత్రమే ఖర్చు వచ్చిందని అధికారులు పేర్కొంటున్నారు. వరద ఇన్‌ఫ్లో రాక మోటార్ల ద్వారా ఎత్తిపోస్తే రూ.కోట్లలో విద్యుత్ ఖర్చు జరిగేది. విద్యుత్ ఖర్చు లేకుండా సహజంగా 13 టీఎంసీల మేర వరదనీరు రావడంతో భారీగా ఖర్చు తప్పినట్లేనని అధికారులు చర్చించుకుంటున్నారు.

ప్రజాసంక్షేమానికి పెద్దపీట

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట(వేములవాడ): తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో రూ.3 లక్షలతో నిర్మించిన మున్నూరుకాపు సంఘం భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. అరుణ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పథకాలు అమలు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. సర్పంచ్ మంతెన సంతోష్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య, ఎంపీటీసీ పల్లె మంజుల, నాయకులు రాఘవరెడ్డి, మంతెన మల్లేశం పాల్గొన్నారు.

ఎస్పీ భాస్కర్‌కు డీజీపీ అభినందన



కుమారుడి ఫొటోతో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద అవగాహన కల్పిస్తున్న ఓ తల్లి



టాఫిక్ రూల్స్‌పై లోగో

జగిత్యాలక్రైం: ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం.. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం... ట్రిబుల్ రైడింగ్‌తో ప్రమాదాలకు గురై మృతిచెందితే ఆ కుటుంబం పడే బాధలను ప్రజలకు వివరిస్తూ ఎస్పీ భాస్కర్ 'చేజారిన కొడుకు'..అనే పాటను రాశారు. ఈ సీడీని శుక్రవారం సాయంత్రం డీజీపీ అంజన్ కుమార్ విడుదల చేయడంతోపాటు ఎస్పీ భాస్కర్‌ను ట్విట్టర్‌లో ప్రత్యేకంగా అభినందించారు.



తీరనున్న వాహనదారుల కష్టాలు

రుద్రంగి(వేములవాడ): మండలకేంద్రంలోని రోడ్డు పూర్తిగా ధ్వంసమై కొన్నేళ్లగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా ఎట్టకేలకు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై పలుసార్లు సాక్షిలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించడంతో ఇక ఇబ్బందులు తీరనున్నాయని ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు



అరెస్టు చూపుతున్న సీఐ కరుణాకర్

వేములవాడ : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని ఆర్‌బీఎం బేకరి వద్ద పోలీసులు తనిఖీలు చేయగా గంజాయి విక్రయిస్తున్న సిరిసిల్లకు చెందిన భూరాణి నరసింహ (38), వేములవాడలోని రాం మందిరం వీధికి చెందిన పర్రె శివకుమార్ (38)ను ఆదివారం అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. వీరి నుంచి వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తే 100కు సమాచారం అందించాలని సీఐ పేర్కొన్నారు.

సర్పంచ్ వెంకట్‌రెడ్డికి సన్మానం



సర్పంచ్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి ఇటీవల జాతీయ ఉత్తమ సేవా పురస్కారం అందుకోగా.. ఆదివారం నారాయణపూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సర్పంచ్ నిమ్మ లక్ష్మినారాయణరెడ్డి, సంఘం అధ్యక్షుడు నిమ్మ మల్లారెడ్డి, యూత్ అధ్యక్షుడు గోగూరి గోవర్ధన్‌రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మల్లాపూర్ : తాళం వేసిన ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని ముత్యంపేటలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నిమ్మల లక్ష్మారెడ్డికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉపాధి కోసం లక్ష్మారెడ్డి గల్ఫ్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో భార్య పద్మ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లింది. గుర్తు తెలియని తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 8 గ్రాముల బంగారం, 10 తు లాల వెండి, రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం పద్మ ఇంటికి చేరుకోగా దొంగతనం జరిగినట్లు భావించి పోలీసుల కు సమాచారం అందించింది. ఎస్సై నవీన్‌కుమార్, సిబ్బంది చేరుకొని క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. పద్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రీడా ప్రాంగణాలకు స్పోర్ట్స్ కిట్లు

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు 1,549 మంజూరు
- త్వరలో అందించనున్న అధికారులు



సప్తగిరికాలనీలోని తెలంగాణ క్రీడా ప్రాంగణం



జగిత్యాల జిల్లాకు చేరిన కిట్లు

ఉమ్మడి జిల్లా సమాచారం

జిల్లా	మంజూరైన కిట్లు
జగిత్యాల	553
కరీంనగర్	434
రాజన్న సిరిసిల్ల	307
పెద్దపల్లి	255

కరీంనగర్ స్పోర్ట్స్: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఔత్సాహిక క్రీడాకారులను క్రీడల్లో తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు శ్రీకారం చుట్టింది. గ్రామం, మున్సిపాలిటీ వార్డుల్లో ఎకరం స్థలంలో దాదాపు రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేసి, వీటిని తీర్చిదిద్దారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులతోపాటు లాంగ్‌జంప్ పిట్, సింగిల్ ఎక్సర్‌సైజ్ బార్‌లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 312 గ్రామాల్లో ఈ ప్రాంగణాలు అందబాటులోకి వచ్చాయి.

12 రకాల సామగ్రి..

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు క్రీడా కిట్లు త్వరలో పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు కిట్లు రాగా కరీంనగర్‌కు రేపోమాపో రానున్నాయి. కిట్‌లో క్రికెట్‌కు సంబంధించి 12 రకాల సామగ్రి, వాలీబాల్ కిట్‌లో నెట్, బాల్స్, ఫుట్‌పంప్, టేప్‌తోపాటు జిమ్‌కు సంబంధించి 30 కిలోల మూడు సెట్ల డంబెల్స్, 1, 2 కేజీల డిస్కస్‌త్రోలు, 6 టెన్నికాయిట్ రింగ్స్, 4 స్కిప్పింగ్ రోప్, 3 విజిల్స్, ఒక స్టాప్‌వాచ్, కిట్ బ్యాగ్‌తోపాటు క్రీడాకారులకు 75 టీషర్టులు ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు క్రీడా కిట్లు అందనుండటంతో గ్రామీణ క్రీడాకారులు రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేసుకునే అవకాశం ఏర్పడింది. దీంతో వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతారు. క్రీడా కిట్లను సద్వినియోగం చేసుకోవాలి.

– కీర్తి రాజవీరు, డీవైఎస్‌వో, కరీంనగర్

ఔత్సాహిక క్రీడాకారులకు వేదిక



క్రీడా ప్రాంగణాలు ఔత్సాహిక క్రీడాకారులకు ఒక వేదికలా ఉపయోగపడనున్నాయి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ద్వారా క్రీడా ప్రాంగణాలకు క్రీడా కిట్లు వచ్చాయి. త్వరలో పంపిణీ చేస్తాం. క్రీడాకారులు క్రీడా ప్రాంగణాల్లో ప్రాక్టీస్ చేయాలి.

– రవి, డీవైఎస్‌వో, జగిత్యాల

పరమేశ్వరా పాహిమాం





వేములవాడ: వరుస సెలవులు రావడంతో రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి తడి బట్టలతో కోడెమొక్కులు చెల్లించుకున్నారు. కళాభవన్‌లో కల్యాణాలు, సత్యనారాయణవ్రతాల మొక్కులు చెల్లించుకున్నారు. ఆరుద్ర నక్షత్రోత్సవ పూజలు, మహాన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం, పరివార దేవాతార్చనలు, సదస్యం నిర్వహించారు. రాష్ట్ర వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ బొడ్డ శైలజ స్వామిని దర్శించుకున్నారు.



నేటినుంచి గాంధీ చిత్ర ప్రదర్శన

సిరిసిల్ల అర్బన్: స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 14 నుంచి 24 వరకు జిల్లాలోని అన్ని థియేటర్లలో మహాత్మాగాంధీ చలన చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. 14న ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటలకు, 16 నుంచి 24 వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని అధికారులు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు



శ్రీ సీతారామాలయం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న శ్రీ సీతారాముల ఆలయ పునఃనిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ట్రస్ట్ ద్వారా ఆదివారం రూ.70 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న మాట్లాడుతూ... మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో టీటీడీ మాజీ చైర్మన్, వైవీ.సుబ్బారెడ్డి గారికి విన్నవించగా నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. సీతారామాలయం వేరేచోట నిర్మాణం చేపట్టనుండటంతో రోడ్డు విస్తరణ పనులు పూర్తయి ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయి.



మినీస్టేడియం.. క్రీడాకారుల సందడి





సిరిసిల్ల మినీ స్టేడియం పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తోంది. వివిధ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న పీఈటీలతో ప్రతి రోజు ఉదయం 6:30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5:30 నుంచి 6:30 గంటల వరకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. యోగా, అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో, క్యారం క్రీడల్లో దాదాపు 60 నుంచి 70 మంది విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల